క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరి


హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శివాజీ

దెందులూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని దెందులూరు ఎస్‌ఐ ఆర్ శివాజీ అన్నారు. సోమవారం దెందులూరు చెక్ పోస్ట్, సత్యనారాయణపురం వద్ద హెల్మెట్లపై అవగాహన కల్పించారు. 18 మంది ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాల నంబర్లు నోట్ చేసుకోవడం జరిగిందని, రెండోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

భీమడోలులో వికసించిన మే పుష్పాలు


భీమడోలులోని ఓ ఇంట్లో పుష్పించిన మే పుష్పాలు

భీమడోలు: భీమడోలులోని ఓ ఇంట్లో మే పుష్పాలు పుష్పించి కనువిందు చేశాయి. గ్రామంలోని యడ్ల బంగారయ్య ఇంట్లోని ఓ కుండీలో పెరిగిన మే పుష్పాలు వికసించి చూపరులను ఆకట్టుకుంటున్నారు. ఐదారు రోజుల కితమే నాలుగు పుష్పాలు వికసించాయని యాజమాని అంటున్నారు. చాలాన్నళ్లుగా వేసవిలో ఈ మే పుష్పాలు పుష్పిస్తాయని తెలిపారు. సాధారణంగా ఎండలు విపరీతంగా ఉన్న మే నెలలో ఈ పుష్పాలు వికసిస్తాయని, దీనితో వీటిని మే పుష్పంగా పిలుస్తారు. ఇది లిల్లీ జాతికి చెందిన మొక్క, దీని పువ్వులు చూడడానికి బంతిలాగా ఉంటాయి. ఈ మే పుష్పాలను తిలకించేందుకు సోమవారం గ్రామస్థులు క్యూ కట్టారు.

గుండుగొలనులో వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు


గుండుగొలనులో స్వామి వారికి పూజలు చేస్తున్న పూజారి సాయి

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం శ్రావణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం ఆలయంలో పాలాభిషేక పూజలు ఘనంగా జరిగాయి. ఆలయంలోని భోగ శ్రీనివాసమూర్తికి అభిషేకాలు చేశారు. తొలుత ఆలయ పూజారి మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో అగ్నిహోత్రం సాయి స్వామి వారికి పలు రకాల ఫలాభిషేక పూజలు చేశారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి ముస్తాబు చేసారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత వగ్వాల మీనా కుమారి, వగ్వాల అచ్యుత రామారావు, భక్తులు పాల్గొన్నారు.

సుందరయ్యకు ఘన నివాళి


సుందరయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకిచ్చే ఘన నివాళి అని పలువురు వక్తలు కొనియాడారు. సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆంధ్రప్రదేశ్, రైతు సంఘం, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కోటి నాగేశ్వరరావు, గుండు దుర్గారావు, గోవిందు, కోర్ని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఇబ్బందిపడ్డ మాట వాస్తవమే

- పౌరసరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్

ఉంగుటూరు: ఈ రబీ సీజన్‌లో కొంతమంది రైతులు పలుచోట్ల పలు ఇబ్బందులుపడిన మాట వాస్తవమేనని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఉంగుటూరులో ఎమ్మెల్యే పి.ధర్మరాజు క్యాంపు కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించిన ఆయన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. లక్ష్యాలను పెంచి రైతులవద్ద ధాన్యం కొనుగోలు చేసినట్టు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే ధర్మరాజుతో పాటు జనసేన ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పి.రామాంజనేయులు, బొలిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు భరోసా కరువు

- రైతులకు అందని రైతు భరోసా సొమ్ము
- ఇచ్చిన హామీని పక్కన పెట్టిన ప్రభుత్వం
- ఇబ్బంది పడుతున్న రైతులు


పొలాన్ని దుక్కు దున్నుతూ..

దెందులూరు: ఉన్న ఊరిలోనే రైతులకు సేవలందించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధకశాఖల ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమం, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సాంకేతిక పరికరాలు తదితర పథకాలు అందజేసేందుకు ఈ రైతు భరోసా కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడేవి. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి కావస్తున్న ఇంతవరకూ రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పేరు మార్పు తప్ప సాయం లేదు

మండలంలో సుమారు 10,617మంది రైతులు ఉన్నారు. గత ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభం నుంచి దశలవారీగా డీబీటీ విధానం ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లోకి రైతుభరోసా సొమ్మును అందజేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని ప్రకటించింది. ప్రస్తు ఖరీఫ్ సీజన్ పూర్తయినా కాని నేటికీ ప్రభుత్వం రైతులకు భరోసా అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల పేరు మార్చి రైతు సేవా కేంద్రాలుగా నిర్వహణ చేపట్టారు. కానీ రైతులకు సాయం అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని మండిపడుతున్నారు.

అసంపూర్తిగా భవనాలు

గత ప్రభుత్వం మండలంలోని 20పంచాతీలకు 26 గ్రామ పంచాయతీలుగా, 17 గ్రామ సచివాలయాలుగా విభజించింది. 17గ్రామ సచివాలయాలకు 17రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ఒక్కోదానికి రూ.21లక్ష చొప్పున నిధులు మంజూరు చేసింది. వీటిలో 8కేంద్రాలను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులకు శిక్షణ కార్యక్రమాలు, విత్తనాలు, ఎరువులు అందడం లేదని చెబుతున్నారు.

అందని పెట్టుబడి సాయం



ప్రస్తుత ఖరీఫ్ సీజన్ పూర్తయినా నేటికీ పెట్టుబడి సాయంగా ఒక్క రూపాయి కూడా కూటమి ప్రభుత్వం అందజేయలేదు. ఏటా రూ.20వేలు ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చింది. అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా సొమ్ము అందించలేదు. రైతులందరం ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా పెట్టుబడి సాయం అందించాలి.

– పర్వతనేని నరేంద్రబాబు రైతు, మలక చర్ల

అంతర్జాతీయ యోగా డేను విజయవంతం చేయాలి


కొప్పాక ఉన్నత పాఠశాల్లో విద్యార్థుల యోగసాధన చేయిస్తున్న దృశ్యం

పెదవేగి : జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారని కొప్పాక ఆయుర్వేద వైద్యాధికారి ఎల్ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం పెదవేగి మండలం కొప్పాక ఉన్నత పాఠశాల్లో స్థానిక హెచ్ఎం ఆర్ శైలజ ఆధ్వర్యంలో విద్యార్థులతో ఆయన మమైకమయ్యారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఆర్ శైలజ మాట్లాడుతూ ఈ ఏడాది 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణలో యోగా ప్రాముఖ్యతపై అవగాహన కల్గించేలా కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే అనే ప్రాంతాల్లో గత మార్చి 13 నుంచి జూన్ 21 వరకు 100 రోజుల్లో 100 నగరాల్లో 100 ఆర్గనైజేషన్ల పేరిట గ్లోబల్ ప్రచార కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ×యోగాంధ్ర–2025 నినాదంతో ప్రజల్లో యోగాపట్ల అవగాహన కల్పించేందుకు కొప్పాక పరిసర ప్రాంతాల్లో తమ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తమ కృషి చేస్తున్నామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకుడు కె వినోద్ కుమార్ పాల్గొని, విద్యార్థులతో యోగసాధన చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి


ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో మాట్లాడుతున్న బాబ్జీ

ఉంగుటూరు: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ అధ్యక్షతన నియోజకవర్గ రాజకీయ పార్టీల నేతలతో సలహా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శి యోలిశెట్టి పాపారావుబాబ్జి మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో ఓటర్ల జాబితాలో మార్పులను సరిచేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నియామకాలు

దెందులూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా పలువురికి పదువులు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ సీపీ మహిళా విభాగానికి అంగడాల సీతారావమ్మ, యువజన విభాగానికి తానంకి పెద్దిరాజు, రైతు విభాగానికి చల్లగోళ్ళ వెంకటేశ్వరరావు, బీసీ సెల్‌కు మట్టా రామ శంకర్, ఎస్సీ సెల్‌కు మద్దాల నాగయ్య, ఎస్టీ సెల్‌కు నాగులపల్లి రంగారావు, మైనార్టీ సెల్‌కు షేక్ మీరా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు పీవీ రాజు, స్టూడెంట్ విభాగానికి పత్యాల సుధీర్, పంచాయతీరాజ్ విభాగానికి గుత్తా ప్రసాద్, ఆర్‌టీఐ విభాగానికి కొంగ రత్నకుమార్, వలంటీర్ విభాగానికి చలారీ గోపి కిషోర్, గ్రీవెన్స్ సెల్‌కు బుద్దాల శ్రీనివాసరావు, వాణిజ్య విభాగానికి గంగిరెడ్డి కృష్ణాంజనేయులు, వీవర్స్ విభాగానికి ఆకుర్తి శేఖర్, వైఎస్సార్ టీయూసీకి సింగవరపు సూర్యనారాయణ, అంగన్‌వాడీ వింగ్‌కు మోటేపల్లి రాజ్యలక్ష్మి, లీగల్ సెల్‌కు యర్రా సురేష్, కల్చరల్ విభాగానికి ఘంటసాల ప్రభాకరరావు, సోషల్ మీడియా సెల్‌కు సిరిపురపు రాజేష్, ఐటీ విభాగానికి అక్కినేని గోపి, దివ్యాంగుల విభాగానికి కట్నేని తులసిరామ్, డాక్టర్స్ విభాగానికి గొరిపర్తి రమేష్, మేధావుల ఫోరానికి బోయపాటి గణేష్, ఉద్యోగుల, పెన్షనర్స్ విభాగానికి రాచూరి బాలస్వామి, బూత్ కమిటీ విభాగానికి తలారి రామకృష్ణ, పబ్లిసిటీ విభాగానికి తోట పద్మారావులను నియమించారు.

నీలం సంజీవరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకం


నీలం సంజీవరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీవీ ఉమామహేశ్వరరావు, విద్యార్థులు, పెద్దలు

భీమడోలు: ఆంధ్రప్రదేశ్ తొలి సీఎం నీలం సంజీవరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో 18వ రోజైన సోమవారం వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. భీమడోలు లైబ్రరీలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు అధిక సంఖ్యలో హాజరై శిక్షణాంశాలను సద్వినియోగం చేసుకున్నారు. నీతి కథలు వినడం, నీతి కథలు చెప్పడం, పుస్తక పఠనం, సమీక్షలు రాయడం వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని వినియోగించుకున్నారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ గణితంలోని మెలకువలను తెలిపారు. తుమ్మల ఉమామహేశ్వరరావు భారతం, రామాయణం వాటిలోని నీతి కథలు వారికి చెప్పారు. తొలుత ఏపీ తొలి సీఎం, రాష్ట్రపతి, లోక్ సభ స్పీకర్ వంటి కీలక పదవుల్లో పని చేసిన నీలం సంజీవరెడ్డి 112వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఉమామహేశ్వరరావు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంజీవరెడ్డి జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమన్నారు. వారసత్వ రాజకీయాల వ్యతిరేకించిన మహోన్నత వ్యక్తి అన్నారు. అనంతరం వివిధ ఆటలను ఆడించారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమాల్లో భీమడోలు, పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మరియమాత ఉత్సవాలు


పెదలింగంపాడులో అలంకరించిన ఎడ్ల బండిపై మరియమాతను ఊరేగిస్తున్న దృశ్యం

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారు పెదలింగంపాడు గ్రామంలో రెండు రోజుల పాటు నిర్వహించిన మరియమాత మహోత్సవాలు సోమవారంతో ఘనంగా ముగిసాయి. ఆలయంలో విచారణ గురువులు ఫింటో థామస్ ఆధ్వర్యంలో రెవరెండ్ ఫాదర్స్ టోని, నెల్సన్ జాన్, జింటో, జిజో ఆర్ సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫింటో థామస్ వాక్యోపదేశాన్ని అందించారు. ప్రతి ఒక్కరూ ఇతరుల పట్ల ప్రేమ, జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. కరుణామయుడైన ఏసుక్రీస్తు పూజార్హుడన్నారు. వాక్యానుసారంగా క్రైస్తవులంతా జీవించాలన్నారు. అనంతరం గ్రామంలో అలంకరించిన ఎడ్ల బండిపై మరియమాత విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. రంగుల జల్లుకుంటూ ఊరేగారు. గ్రామస్తులు మరియమాతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నిర్మల సిస్టర్స్, సిజో భవన్ సిస్టర్స్, విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


పెదపాడు గ్రామంలో డెంగ్యూ అవగాహన దినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పెదపాడు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.కె. అనంత్‌పాల్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ డెంగీ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కళాజాత, ర్యాలీ నిర్వహించారు. అనంతరం అనంత్‌పాల్ మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలను పాటించాలని కోరారు. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు


ఆలయంలో నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు


పెదపాడు : మండలంలోని అప్పనవీడులోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని సందర్భంగా 1008 చామంతులతో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాతసేవతో పూజలు ప్రారంభించారు. కోదండ రామాంజనేయ భజన సమాజం బిళ్లన పల్లి, రామాంజనేయస్వామి భజన సమాజం వారిచే హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయికృష్ణ కోలాట బృందంవారిచే కోలాటం నిర్వహించారు. వెండి, బంగారు పుష్పాలతో ప్రత్యేక పూజలు నక్షత్రహారతి జరిపారు. అనీల్‌కుమార్ డాన్స్‌ఇన్‌స్టిట్యూట్ వారిచే డ్యాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమం నిర్వహించారు. నవీన ఆర్కెస్ట్రా వారిచే మ్యూజికల్‌నైట్ జరిగింది. ఈకార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉన్నత లక్షణాలతో.. ఉన్నత స్థానం


పినకడిమిలో ఎన్‌సీసీ కెడెట్‌లకు ధ్యానం యొక్క ప్రాముఖ్యతను వివరిస్తున్న వెంకటేష్ గురూజీ

పెదవేగి : ఉన్నతమైన లక్షణాలతో...ఉన్నతమైన స్థానాలు పొందగలుగుతారని ఏలూరులోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమానికి చెందిన వెంకటేష్ గురూజీ అన్నారు. పెదవేగి మండలం పినకడిమిలోని విన్సెంట్ డిపాల్ కళాశాల్లో జరుగుతున్న ఏటీసీ–2 ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమంలో కేడేట్స్‌కు సోమవారం మోటివేషన్, మెడిటేషన్‌కు సంబంధించి విలువైన విషయాలను బోధించారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ వైద్య సిబ్బంది, శిక్షణ పొందుతున్న విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాటించవలసిన వ్యక్తిగత, రోగ నివారణ చర్యల గురించి వివరించారు. ఎన్‌సీసీ శిక్షణా కార్యక్రమం 19ఎ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే ఎన్‌సీసీ కార్యాలయ ఎం కొండయ్య, కాంప్ ఆర్గనైజింగ్ కెప్టెన్ కె శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 600 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన అవసరం


వైద్య పరీక్షల కోసం బాలలను ఆసుపత్రికి తీసుకువెళ్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: చిన్నారుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని పోతునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య పరీక్షలు చేసిన బాలలను జిల్లా బాలసత్వర చికిత్స కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పోతునూరులో ఆయన మాట్లాడుతూ చిన్నారుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ వైద్య పరీక్షలు వైద్య సేవల కోసం రాష్ట్రీయ బాల స్వాస్థ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎంపీహెచ్‌ఈఓ హరి, వైద్య సిబ్బంది ఉన్నారు.

రేపటి నుంచి మద్దిలో కల్యాణోత్సవాలు


గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి హనుమద్ జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సోమవారం కార్యక్రమాల వివరాలను ఆమె వెల్లడించారు. 21వ తేదీ ఉదయం ప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నిత్యకైంకర్యాలతో పాటు నిజరూప దర్శనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురారోపణం, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ గురువారం నిత్య కైంకర్యాలతో పాటు హనుమద్ జయంతి సందర్భంగా స్వామి వారి లక్ష తమలపాకులతో పూజ, నిత్యహోమం, బలిహరణలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 23వ తేదీ సువర్చలా హనుమద్ కల్యాణం, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 24వ తేదీ నిత్యపూజలతో పాటు ఉపాలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ నిత్యపూజలతో పాటు మహా పూర్ణాహుతి, దీక్ష విరమణ, స్వామి వారికి అభిషేకం, ధ్వజావరోహణ, చక్రస్నానం, సాయంత్రం 7 గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు.

గణితంతో మేధస్సుకు పదును


గణితంపై శిక్షణ ఇస్తున్న రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గణితంలో మెళకువలను నేర్చుకోవడం ద్వారా మేధస్సు మరింత పెరిగి విద్యార్థులు అన్ని రంగాల్లో విజయం సాధిస్తారని రిసోర్స్ పర్సన్ కె.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక జిల్లాకేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు 18వ రోజు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. ఈ శిక్షణ తరగతుల్లో చిన్నారులు ఎంతోహుషారుగా పాల్గొంటున్నారు. ఉదయం గ్రంథాలయ సిబ్బంది విద్యార్థులకు చదవడం మాకిష్టంలో భాగంగా నీతి కథలను చదివించి, వారితో కథలు చెప్పించారు. ఈ సందర్భంగా సోమరిపోతు నెమలి – ఒక వ్యాపారి అనే నీతి కథలను బోధిస్తు జీవితంలో ఎప్పుడూ సోమరితనంగా, బద్ధకంగా ఉండ కూడదని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని విజ్ఞానంతో కూడిన సందేశాన్నిచ్చారు. అనంతరం రిసోర్స్ పర్సన్ వై.ఫణికాంత్ విద్యార్థులకు నృత్యాలపై శిక్షణ కొనసాగించారు. ఈ శిక్షణలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్‌కుమార్, ఎండీ అస్లాం పాషా, బీవీఎస్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

డివిజనల్ కమాండర్ దంపతులకు సత్కారం


డివిజనల్ కమాండర్ దంపతులను సత్కరిస్తున్న కోర్ ఆఫీసర్

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ ఏలూరు జిల్లా నూతన డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం లతా దంపతులకు సోమవారం దెందులూరు సాల్వేషన్ ఆర్మీ కోర్ ఘనంగా స్వాగతం పలికి వారి కార్యాలయంలో సత్కరించింది. కోర్ ఆఫీసర్ కాకి రమణయ్య, రిటైర్డ్ కల్నల్ జోషి, సంఘ పెద్దలు, సంఘస్తులు, గృహ సమితి సభ్యులు, యువత పూలదండ శాలువాతో సత్కరించి జ్ఞాపక అందజేశారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష

వేలేరుపాడు: మండలంలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీవో నంబర్ 3 గురించి రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్ష చేస్తున్న వారికి మద్దతుగా మండల కమిటీ నాయకులు సంఘీబావం తెలిపి మాట్లాడారు. మండలంలోని ఏఎస్పీ అధ్యక్షుడు సోడా సీతారామయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ క్లియరైన వారిని పునరావాసాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఉయిక ముత్యాలరావు, సీహెచ్ రామకృష్ణ, కణితి లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విజయకేతనం


ఉపాధ్యాయులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సీబీఎస్ఈ బోర్డు 10వ తరగతి, ప్లస్–2 పరీక్షా ఫలితాల్లో స్థానిక సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేశారని ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్ తెలిపారు. వీరిని సోమవారం స్కూల్‌లో అభినందించారు. ప్లస్–2 విద్యార్థి ఎస్.ఆశ్రిత్‌రామ్, పదో తరగతి విద్యార్థి లక్షిత, వివిధ సబ్జెక్టుల్లో నూటికి నూరు మార్కులు సాధించిన మరో 10 మందికి, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం నగదు బహుమతులు ఇచ్చి సత్కరించింది. అనంతరం ఎన్‌సీసీ పాయింట్ 22 సెమిలేటర్ ఫైరింగ్ రూమ్‌ను అతిథులు ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్ రెడ్డి విద్యాసంస్థల ప్రెసిడెంట్ అల్లూరి ఇంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ వీవీ బాలకృషాణ్ణరావు, సెక్రటరీ, జాయింట్ సెక్రెటరీలు వల్లభనేని శ్రీకృష్ణ, ట్రెజరర్ చిట్టూరి జానకి రామయ్య, ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ మల్లిబాబు, బీఈడీ కాలేజ్ కరస్పాండెంట్ కిలారు ప్రభకరరావు, సీఆర్ రెడ్డి పాఠశాల కరస్పాండెంట్ వంకినేని రఘు కుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమడోలు: భీమడోలు సెక్షన్ పరిధిలోని పూళ్ల సబ్‌స్టేషన్ ఏరియాలో మొక్కలు తొలగించడం, విద్యుత్ లైన్లకు మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటులో భాగంగా ఈనెల 20వ తేదీ మంగళవారం పూళ్ల, ఎంఎంపురం ఫీడర్లకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ శివాజీ తెలిపారు. భీమడోలులో సోమవారం సాయంత్రం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.